# వడ్డీ మాఫీకి 'నేటితో ఆఖరు'

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ :** 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీ మాఫీ నేడు (ఆదివారం) ఆఖరు అని, ఈఅవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ డాక్టర్ జె.అరుణ శనివారం ఓ ప్రకటనలో కోరారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను బకాయిల మొత్తాన్ని ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీ మాఫీ ఉంటుందన్నారు. బకాయిల మొత్తాన్ని ఈనెలాఖరు (మార్చి 31) తేదీలోగా (ఆదివారం) చెల్లించాల్సి ఉంటుందన్నారు. వడ్డీ మాఫీ అవకాశాన్ని పొందడానికి ఇక కేవలం ఒక్క రోజు మాత్రమే మిగిలి ఉందని పన్ను చెల్లింపుదారులు వారి పన్ను బకాయిలను ఏక మొత్తంగా చెల్లించి వడ్డీ మాఫీ పొందాలన్నారు. ఆదివారం రోజైనా నగరపాలక కార్యాలయంలోని పురసేవ కేంద్రం పనిచేస్తుందని, వార్డు సచివాలయాల్లోనూ పన్నులను చెల్లించవచ్చని కమిషనర్ తెలిపారు.

# మతోన్మాద బిజెపిని ఓడించండి

**ఇండియా కూటమిని బలపరచండి: సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపు**

సమావేశంలో మాట్లాడుతున్న వాడ గంగరాజు

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** దేశంలో మతోన్మాద బిజెపిని దానిని బలపరిచే వారిని 2024 ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపునిచ్చారు. శనివారం సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించడం వలన దేశంలో తీవ్ర సంక్షోభం ఏర్పడిందన్నారు. మోడీ విధానాల వలనే దేశంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని అలాంటి పార్టీని 2024 లోకసభ ఎన్నికల్లో అధికారంలోకి రానీయకుండా ప్రజలందరూ తీర్పునివ్వాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా ఆంధ్ర రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి బుద్ధి చెప్పాలన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలను తన గుప్పెట్లో పెట్టుకోవడానికి రాష్ట్రాలకు ఉన్న హక్కులను కాలరాసి రాష్ట్రాలపై దాడి చేస్తున్నదన్నారు. అలాంటి పార్టీని రాష్ట్రంలో అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలన్నీ దాని వెనుక తిరుగుతూ ప్రజలను మోసం చేస్తున్నాయని అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు చివరి కాకూడదని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ఓటు అనే ఆయుధంతో బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా మతోన్మాద బిజెపిని ఓడించడానికి ఇండియా కూటమి రోజురోజుకి బలపడుతున్నదని ఆ కూటమికి జిల్లాలో కూడా ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలన్నారు.

# చేనేత హస్తకళలను ఆదరించండి

**మేనేజర్ లక్ష్మినారాయణ**

సిఎం కళ్యాణ మండలపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** నగరంలోని సీఎం కళ్యాణ మండపంలో రాష్ట్ర ప్రభుత్వ చేనేత హస్తకళ మేళాను శనివారం కళా సంస్కృతి చేనేత హస్తకళ మేనేజర్ లక్ష్మీనారాయణ ప్రారంభించారు. చేనేత కళాకారులను ఆదరించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో పోచంపల్లి, కలంకారి, మంగళగిరి చేనేతలు కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, హైదరాబాద్ మంచి ముత్యాల ఆభరణాలు, లెదర్ బ్యాగులు జ్యూట్ బ్యాగులు గృహోపకరణాలు మొదలైన వస్తువులు ప్రదర్శనలో ఉంచుతామన్నారు. ఈ ప్రదర్శనలు మార్చి 30వ తేదీ నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 10 నుండి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఏనుగు దాడిలో పాడి ఆవు మృతి

**ప్రజాశక్తి- సోమల:** ఒంటరి ఏనుగు దాడిలో ఓ పాడి ఆవు మృతిచెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధిత రైతులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అన్నెమ్మగారిపల్లి గ్రామానికి చెందిన వెంకట రమణ అనే రైతు తన పొలం వద్ద ఆవుల కోసం ఓ షెడ్డును నిర్మించి అక్కడే ఆవులను కట్టేసి ఉంచేవాడు. యథాప్రకారం శుక్రవారం మేత తరువాత రాత్రి షెడ్డు వద్ద ఆవులను కట్టేసి పక్కనే ఉన్న ఇటుకల బట్టీ వద్ద నిద్రపోయాడు. అర్ధరాత్రి సమయంలో ఆవు అరుపులు విని లేచ్చాడు.. అయితే ఏనుగు ఘీంకారాలు వినిపించడంతో ఒంటరిగా ఆవు దగ్గరికి వెళ్లే ధైర్యం చేయలేకపోయాడు. ఉదయం చూడగా రెండు ఆవులు తాడును తెప్పుకుని పారిపోగా గర్భంతో ఉన్న ఆవును ఏనుగు చంపేసిందని ఆవేదన వ్యక్తం చేశాడు. కుటుంబానికి జీవనాధరమైన పాడి ఆవు మరణించిందని, దీని విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ, పశువైద్య సిబ్బంది, సర్పంచ్ వనజమ్మ, నాయకులు రమణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

ఏనుగుదాడిలో మృతి చెందిన పాడి ఆవు

ఏమిటీ గుస గుస గుస

చంద్రబాబు చెవిలో చెబుతున్న కోలా, ఆసక్తిగా బొజ్జల సుధీర్

నాయుడుపేట సభలో

# అభివృద్ధి చేసి చూపిస్తా..!

## ప్రజాగళం సభల్లో చంద్రబాబు

- ట్రై సిటిలుగా తిరుపతి, నెల్లూరు, చెన్నయ్
- విద్యా, పారిశ్రామిక హబ్‌గా శ్రీకాళహస్తి
- నాయుడుపేటకు ఐటి క్లబ్

టిడిపి గ్రూపుల పోరు నేపథ్యంలో బాబును కలిసిన ఆదిమూలం

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, నాయుడుపేట**

తిరుపతి, నెల్లూరు, చెన్నయ్‌లను ట్రైసిటీలుగా తీర్చిదిద్దుతానని, ఈ లక్ష్యంతోనే నెల్లూరు - చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్‌కు రూపకల్పన చేశానని, కృష్ణపట్నం ఓడరేవు, రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేశానన్నారు. శ్రీకాళహస్తిని విద్యా పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతానని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఎన్నికల హామీ ఇచ్చారు. శనివారం తిరుపతి జిల్లా నాయుడుపేట, శ్రీకాళహస్తిల్లో ప్రచార సభలు జరిగాయి. ఈ సందర్భంగా నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో టిసిఎల్, సెల్కాన్, కార్బన్, జీహో పరిశ్రమలు వచ్చాయన్నారు. తిరుపతిని ఎడ్యుకేషనల్ హబ్‌గా చేసేందుకు ఐఐటి, ఐజర్ విద్యాసంస్థలను తీసుకొచ్చామన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక కమీషన్లకు కక్కుర్తిపడి పరిశ్రమలను తరిమేసే స్థాయికి వచ్చారన్నారు. జగన్ కాలనీలపేరిట ఇంటి స్థలాల విషయంలో ఆరువేల కోట్ల స్కామ్ జరిగిందని ఆరోపించారు. నయా పైసలతో వసూలు చేస్తానన్నారు. జగన్‌పెద్ద సైకో అయితే, బియ్యపు రెడ్డి చిన్న సైకో అని ఎద్దేవా చేశారు. గుడిని, గుడిలో లింగాన్ని మింగేసే రకమన్నారు. శ్రీకాళహస్తిలో బియ్యపురెడ్డి చేసిన అవినీతి అక్రమాలన్నింటినీ వెలికి తీస్తామన్నారు. శ్రీకాళహస్తి ఎంఎల్ఎ అభ్యర్థిగా బొజ్జల సుధీర్‌రెడ్డిని, ఎంపి అభ్యర్థిగా వరప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, జనసేన వినుత, కోలా ఆనంద్ పాల్గొన్నారు.

### నాయుడుపేటకు ఐటి క్లబ్ వరం

నాయుడుపేట బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సూళ్లూరుపేట టిడిపి ఇన్‌ఛార్జి నెలవల సుబ్రమణ్యం, ఎంఎల్ఎ అభ్యర్థి నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో ప్రజాగళం సభ జరిగింది. నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ నాయుడుపేటకు ఐటి క్లబ్‌ను తీసుకొస్తానన్నారు. రాష్ట్రంలో 13 లక్షల కోట్లు అప్పు చేశారని, ప్రభుత్వ కార్యాలయాలు తాకట్టు పెట్టారని, అన్నా క్యాంటీన్లను కూల్చేశారన్నారు. నియోజకవర్గ ప్రజలు తమిళనాడుకు వెళ్లి మద్యం, పెట్రోల్ తెచ్చుకునే దారుణ పరిస్థితి ఉందన్నారు. రెండుసార్లు ఎంఎల్ఎగా గెలిచిన కిలివేటి సంజీవయ్యకు అభివృద్ధి అంటే తెలియదని, తట్టెడు మట్టి ఎక్కడైనా వేశాడా అని విమర్శించారు. వైసిపిలో స్మగ్లర్లకు, రౌడీలకు సీట్లు కేటాయించి దౌర్జన్యంతో గెలవాలని ఆలోచిస్తే ప్రజలు ఒప్పుకోరన్నారు. నెలవల విజయశ్రీని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, నాయకులు శిసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, వేనాటి సతీష్‌రెడ్డి, నాయుడుపేట మాజీ సర్పంచి గూడూరు ప్రభావతమ్మ పాల్గొన్నారు.

# 'రియల్' మాఫియా వైసీపీ నాయకులే : సిపిఎం

**ప్రజాశక్తి - రేణిగుంట**

'కంచె వేసేయ్... కబ్జా చేసేయ్ అంటూ సొంత పార్టీలో దొరికినకాడికి దొరికినట్లు దోచుకుంటున్న రియల్ మాఫియా భాగోతాన్ని కప్పిపెడుతూ, ఇతరులపై బురద జల్లుతున్న వైసిపి నాయకుల తీరును సిపిఎం మండల కార్యదర్శి హరినాథ్ ఖండించారు. రేణిగుంటలో వైసిపి చేసిన కబ్జాలు ఒకటా రెండా అంటూ మండిపడ్డారు. కరకంబాడి ఎర్రగుట్టలో 44 ఎకరాలు కబ్జా చేసి మట్టి తవ్వి కోట్లు స్వాహా చేసింది, చెంగారెడ్డిపల్లి గ్రామంలో వందల ఇళ్లు కట్టి అమ్ముకున్నది, తూకివాకం పంచాయతీ నేతాజీ కాలనీ వివేకానంద కాలనీలో ఒక ప్లాట్ లక్ష నుంచి రెండు లక్షల చొప్పున పేదల నుంచి వసూలు చేసింది, ఎర్రంరెడ్డిపాలెం చెరువును వదలకుండా భూఆక్రమణ చేసింది ఎవరో చర్చకు 'సిద్ధమా' అని ప్రశ్నించారు. సిపిఎంపై బురద చల్లడం అంటే సూర్యునిపై ఉమ్మి వేయడమేనన్నారు. సిపిఎంలో చిన్నపాటి అవినీతి అక్రమానికి పాల్పడినా విచారించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటి సాహసం వైసిపి చేస్తుందా? అని సవాల్ విసిరారు. ఓ పంచాయతీ కార్మికుడు మాట్లాడుతున్న వీడియోను ప్రణాళికాబద్ధంగా వైసిపి తీయించి సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేయడం దుర్మార్గమైన చర్యన్నారు. సొంతస్థలాలు కూడబెట్టుకుంటున్నారని సిపిఎంపై దుష్ప్రచారం చేయడం కాదని, సాక్ష్యాలతో నిరూపించాలన్నారు. ప్రభుత్వ స్థలాలు వందలాది ఎకరాలు ఆక్రమించుకుంటూ, రియల్ దందా నడుపుతున్న వైసిపిని ప్రశ్నించినందుకే సహించలేక తమపై తప్పుడు రాతలు రాయిస్తున్నారని, చిత్తశుద్ధి ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారు.

# 'సివిల్ సూట్స్'పై జడ్జిలకు వర్క్‌షాప్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి భీమారావు

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** హైకోర్టు ప్రత్యేక కమిటీ ఎంపిక చేసిన 'సివిల్ సూట్స్'పై న్యాయమూర్తులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా జడ్జి ఇ. భీమారావు పేర్కొన్నారు. శనివారం స్థానిక జడ్పీ సమావేశం హాల్‌లో జివి.కృష్ణయ్య, రిటైర్డ్ జిల్లా జడ్జి మోహన్ రావు, రిటైర్డ్ జిల్లా జడ్జి జేసురత్న కుమార్, రిటైర్డ్ సివిల్ జడ్జిలతో కలసి రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని న్యాయమూర్తులకు వివిధ అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ మనీ సూట్‌లు, మార్ట్‌గేజ్ సూట్‌లు, పార్టిషన్ డాచ్, ఇంజక్షన్ సూట్‌ల గురించి జాగ్రత్త వహించడం ద్వారా జ్యుడీషియల్ ఆఫీసర్లు తమను తాము సన్నద్ధం చేసుకోవాలని ముఖ్య ఉద్దేశంతో జ్యుడిషియల్ ఆఫీసర్లందరికీ పీరియాడికల్ వర్క్‌షాప్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర హైకోర్టు, జిల్లా కేంద్రంలో మూడు నెలలకు ఒకసారి న్యాయశాఖ అధికారులకు వర్క్ షాపులు నిర్వహించాలని హైకోర్టు ప్రతిపాదించిందన్నారు. ఈసమావేశంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ. కరుణ కుమార్, జిల్లా జడ్జి అన్వర్ బాషా, పొక్స్ కోర్టు జిల్లాజడ్జి శాంతి, 8వ అదనపు జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పిడి వెన్నెల, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.ఉమాదేవి, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మాధవి, 3వ అదనపు 1వ తరగతి మేజిస్ట్రేట్, ఎస్.శ్రీనివాస్ మూర్తి, 4వ అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ షేక్.బాబజాన్, స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కీర్తన, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ద్రావిడ వర్సిటీలో బి.ఎడ్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

**ప్రజాశక్తి- గుడిపల్లి**

ద్రావిడ విశ్వవిద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను బి.ఏడ్ ప్రోగ్రామ్‌లలో స్పాట్ అడ్మిషన్ల కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఏకె.వేణుగోపాల్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023 నిర్వహించబడిన ప్రోగ్రామ్‌లలో మిగిలిపోయిన సీట్లు ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఏపిఈడిసెట్‌లో మెరిట్ ఆధారంగా ఏప్రిల్ 3వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఈనోటిఫికేషన్ ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదా ఏదైనా ప్రభుత్వ పథకాలకు అర్హులు కారని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు సెల్: 94930 48264కు సంప్రదించాలని లేదా వర్సిటీ డీన్ అకాడమిక్ అఫైర్స్ కార్యాలయాన్ని సందర్శించాలని కోరారు.

## విజయ సాధనలో ఒత్తిడిని అధిగమించాలి

**జాతీయ సదస్సులో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ వినోద్**

జాతీయ సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వినోద్

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ :** 'విజయ సాధనలో ఒత్తిడిని అధిగమించడం ఎలా' అనే అంశంపై చిత్తూరులోని అపోలో విశ్వవిద్యాలయంలో జాతీయస్థాయి సదస్సు శనివారం నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో 200మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అపోలో యూనివర్సిటీ వైస్‌ఛాన్సులర్ డాక్టర్ వినోద్ మాట్లాడుతూ ఈ అత్యాధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఏ విధంగా ఒత్తిడిని ఎదుర్కోవాలి, ఉద్యోగం, వ్యాపారం చేసే సమయంలో ఎలాంటి ఒడిదుడుకులు ఉంటాయని వాటిని ఓర్పు, సహనంతో ఎలా అధిగమించాలని అవగాహన కల్పించారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ హరి గౌరవ అతిథిగా పాల్గొని సదస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సాంకేతికత, ప్రస్తుత జీవన ప్రమాణాలు ఒత్తిడికి కారణం అవుతున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో రిజిస్టర్ డాక్టర్ పోతరాజు, అధ్యాపకులు డాక్టర్ భాస్కర్ నాయుడు, డాక్టర్ హసీనా, డాక్టర్ మహేంద్రనాథ్ చౌదరి, డాక్టర్ పి.సుధా తదితరులు పాల్గొన్నారు.

## అమరేంద్ర బాబుకు ఘనసన్మానం

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** రెవెన్యూ శాఖలో అమరేంద్ర బాబు చేసిన సేవలు అమూల్యమైనవని జిల్లా రెవెన్యూ అధికారి అధికారి బి.పుల్లయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్‌లో కలెక్టరేట్ పరిపాలన అధికారి వెంకటేశ్వరన్, సి సెక్షన్, డి సెక్షన్ పర్యవేక్షకులు గుణశేఖర్ రెడ్డి, సుశీలతో కలసి ల్యాండ్‌సెక్షన్ సూపరింటెండెంట్‌గా రెవెన్యూ శాఖలో 30 సంవత్సరాలు పనిచేసిన నేడు పదవీ విరమణ పొందుతున్న ఆర్.అమరేంద్ర బాబుకు ఘనంగా ఆత్మీయ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. డిఆర్ఓ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో అమరేంద్ర బాబు వివిధ హోదాలలో చేసిన సేవలు అమూల్యమైనవని తెలిపారు. పదవీ విరమణ పొందుతున్న అరేంద్రబాబు శేషజీవితం శుఖసంతోషాలతో గడపాలన్నారు.

అమరేంద్రబాబును సన్మానిస్తున్న డిఆర్ఓ పుల్లయ్య

# 'ఎన్నికల' నజరానాలకూ 'జీఎస్‌టి' మాయాజాలం

ప్రజా'దృష్టి'

**ప్రజాశక్తి-తిరుపతి సిటి**

ఎన్నికలంటేనే నజరానాలు, ప్రలోభాలు, వస్తువులు, నగదు పంపిణీ అని పరిపాటిగా మారిపోయింది. చీరలు, ముక్కుపుడకలు, గ్రైండర్లు, మిక్సీలు, ఫ్యాన్లు, డిన్నర్ సెట్లు, బొట్టుబిళ్లలు ఆశ చూపి ఓట్లు రాల్చుకునేందుకు బూర్జువా పార్టీల అభ్యర్థులు పథకాలు రచిస్తారు. చివరి అస్త్రంగా నగదు పంపిణీని ఉపయోగిస్తారు. ఎన్నికల బరిలో ఉన్న బూర్జువా రాజకీయ పార్టీలకు ఇది షరా మామూలే. అధికార పార్టీ మరో అడుగు ముందుకేసి కోట్లాది రూపాయల వస్తువులను రహస్య గోడౌన్ ప్రాంతాల్లో ప్రలోభాలకు సిద్ధం చేసింది. అందులో కొంత భాగం (50కోట్లకు పైగా సరుకులు) ఉన్నఫలంగా ఎన్నికల అధికారుల కంటపడడం, వాటిని సీజ్ చేయడం జరిగిపోయాయి. దానికి వక్రభాష్యాలు చెబుతూ అధికార పార్టీ నాయకులు తమ చర్యలను సమర్థించుకోవడం గమనార్హం.

ప్రస్తుతం అధికారంలో ఉన్న వైఎస్ఆర్‌సిపి రెండోసారి విజయం కోసం రకరకాల ఎత్తులు వేస్తోంది. ఎలాగైనా ఈసారీ అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రధాన ప్రతిపక్షాలు సైతం ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. తిరుపతి జిల్లాలోని ఒక పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లోని ఐదు నియోజకవర్గాల్లో అధికార పార్టీ సిట్టింగ్‌లను మార్చింది. మిగిలిన రెండు నియోజవర్గాల్లోనూ ప్రజా వ్యతిరేకత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీంతో ప్రతిపక్ష పార్టీ నాయకులకు గాలం వేస్తోంది. మరో పక్క టిడిపి, బిజెపి, జనసేన కూటమిల్లో అనుకోకుండా కొత్త వారిని తీసుకురావడం, బయట ప్రాంతాలకు చెందిన వ్యక్తులను అభ్యర్థులుగా ప్రకటించడంతో కొంత గందరగోళ పరిస్థితులు కనిపిస్తున్నాయి. వీటన్నిటిని అధిగమించేందుకు అసంతృప్తి నేతలకు అన్ని బూర్జువ పార్టీలు తాయిలాలు ఎరవేస్తున్నాయి. అధికార పార్టీ మరో అడుగు ముందుకేసి ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు, వారికి నజరానాగా అందజేసేందుకు కొన్ని వస్తువులను కొనుగోలు చేసి, కోట్లాది రూపాయల సరుకులను సిద్ధం చేసింది. దీనికి జిల్లాలోని ఓ సీనియర్ నాయకులు బాధ్యత తీసుకున్నారు. తన నియోజవర్గంలో ప్రతి సంక్రాంతి, దీపావళి, ఉగాది, వినాయకచవితి పండుగలకు ప్రతి కుటుంబానికీ బట్టలు, టపాకాయలు, వినాయక విగ్రహాలు, క్రికెట్ కిట్లు అందజేయడంలో ఆయన దిట్ట. ఈ నేపథ్యంలో రేణిగుంట సమీపంలోని ఓ పెద్ద గోడౌన్‌లో భారీ స్థాయిలో ఫర్నిచర్, ఇతరత్రా పరికరాలను సిద్ధం చేశారు. అది ఆ నోట, ఈ నోట మారి ప్రతిపక్షాలకు తెలియడంతో వారు ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇంకేముంది రేణిగుంట సమీపంలోని ఆ గోడౌన్ వద్దకు చేరుకుని, ప్రతిపక్షాల ముందే వస్తువులు తరలిస్తున్న భారీ లారీని, గోడౌన్‌ను సీజ్ చేశారు. ప్రలోభాల కోసం వస్తువులు తరలిస్తూ బహిరంగంగా దొరికిన అధికార పార్టీపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి ప్రతిపక్షాలు ఫిర్యాదు చేశాయి. వెంటనే అప్రమత్తమైన అధికార పార్టీ, అనుభవజ్ఞుడైన నాయకుడిని రంగంలోకి దించింది. గోడౌన్‌లో 50 కోట్లకు పైగా వస్తువులు ఉన్న మాట వాస్తవమేనని, అది ఎన్నికల ప్రచారానికి చెందిన పరికరాలు, బ్యానర్లు, జెండాలు, తమ పార్టీ గుర్తు, కుర్చీలు, టేబుల్, షామియానాలు, ఇతరత్రావేనని, అవి కూడా జిఎస్‌టి చెల్లించి, బహిరంగంగా కొనుగోలు చేసిన వస్తువులేనని చెప్పారు. ఇదంత బహిర్గతమేనని, రహస్యమేమి లేదని, అధికార పార్టీపై అసత్య ప్రచారాలు మానుకోవాలని చెబుతున్నారు. అంతే ఇంకేముంది అధికారులు సైతం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సీజ్ చేసిన వస్తువుల విషయం ఎన్నికల కమిషన్‌కు తెలియజేశామని, సంబంధిత వ్యక్తులు సరైన బిల్లులు సమర్పించే దాన్ని బట్టి ఈసి నిర్ణయం తీసుకుంటుందంటూ చేతులు దులుపుకున్నారు. ఇదే కాదు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో భారీ స్థాయిలో మద్యం సైతం స్వాధీనం చేసుకున్నారు. పనపాకం సమీపంలోని టోల్‌ప్లాజ్ వద్ద సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న 50లక్షలకుపైగా నగదు, పలు ప్రాంతాల్లో ఆధారాలు లేని నగదు, అక్రమ మద్యం, కొన్ని రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు స్వాధీనం చేసుకున్న వాటిని మావి కాదంటే మావి కాదంటూ అధికార, ప్రతిపక్ష పార్టీలు తప్పుకుంటూ ఎదుట వ్యక్తులపై విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారులు మాత్రం సీజ్ అయిన వాటి గురించి సరైన వివరాలు బహిర్గతం చేయకపోవడం గమనార్హం. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఇలాంటి ఘటనలపై ఈసి కొరడా ఝులిపించి, ఓటర్లు స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు కల్గించుకునే ధైర్యాన్ని కల్పించేందుకు ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టాలని, ప్రలోబాలకు, నజరానాలకు అడ్డుకట్ట వేయాలని, పలువురు మేధావులు, ప్రజాస్వామ్య వాదులు కోరుతున్నారు.

## అలరించిన 'విరించి' ఫ్లాష్ మాబ్

**ప్రజాశక్తి - క్యాంపస్:** విద్యార్థినిలు సాంకేతిక విద్యతో పాటు సాంస్కృతిక సంగీత కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా పరిపూర్ణ మూర్తిమత్వం పొందగలరని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి భారతి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విద్యార్థినులు విద్యాలయం ప్రాంగణంలో శనివారం ఫ్లాష్ మాబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. "విరించి 2కె24" సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఆచార్య డి. భారతి, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని హాజరయ్యారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినిలు విద్యుత్ తో పాటు సంగీత సాంస్కృతిక నత్య కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా పూర్తిస్థాయిలో ఒత్తిడిని నివారించుకోవచ్చు అన్నారు. ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఆచార్య పి.మల్లికార్జునరావు, ఆచార్య వి.సరిత విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కన్వీనర్ గా ఆర్. ప్రియదర్శిని, కో-కన్వీనర్ టి.పల్లవి, ఫ్లాష్ మాబ్ సంబంధించిన ఉపాధ్యాయ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ సమన్వయకర్తలు వి.సరస్వతి బాయ్ (సిఎస్ఈ), కె.సుశీల (ఈసిఈ), విద్యార్థిని సమన్వయకర్త వై.ప్రశాంతి (సిఎస్ఈ), కమిటీ సభ్యులు ఎస్. మంజూష (ఈసిఈ), ఈ.బిందుప్రియ (ఈఈఈ), ఎస్. అనిత (ఎంఈ) విద్యార్థినులతో కలసి వారి ఆనందాన్ని సంతోషాన్ని సంగీతనాదములతో అలరించారు.

## ఓటు హక్కుపై అవగాహన

యువఓటర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** యువతరం ఓటర్లే ఓటుకు బలమైన వారధులని నగరపాలక నోడల్ టీం అధికారుల బృందం నగరంలోని క్రియ ప్రైవేట్ లిమిటెడ్ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. శనివారం చిత్తూరులోని క్రియ ప్రైవేటు లిమిటెడ్ ఉద్యోగులకు ఓటు హక్కు వినియోగం, ఈవీఎంల పనితీరు, నైతిక ఓటు హక్కు అంశాలపై అవగాహన కల్పించారు. స్వీప్ అసిస్టెంట్ నోడల్ అధికారి, ఇన్చార్జి ఎంహెచ్వో చిన్నయ్య మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో యువతరం తప్పనిసరిగా భాగస్వాములు కావాలని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కును బాధ్యతగా పూర్తి చేయాలన్నారు. యువతరంతో నిండిన ఉద్యోగులంతా ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు వేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీనియర్ హెచ్ఆర్ ప్రకాష్, స్వీప్ టీం సభ్యులు పాల్గొన్నారు.

## మూడు తరాల రోడ్డు సమస్య పరిష్కారం

**ప్రజాశక్తి- వెదురుకుప్పం:** నగరి మండలంలోని బీరకుప్పం పంచాయతీ కావేటిపురం దళితవాడకు మూడు తరాలుగా ఉన్న రోడ్డు సమస్య ప్రస్తుత ప్రభుత్వంలో పరిష్కారమైంది. సుమారు 60 కుటుంబాలు 185 మంది జనాభా నివశించే ఈ దళితవాడకు సౌకర్యాలు కల్పించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయి. గ్రామానికి వెళ్లడానికి క్రమమైన దారి కూడా లేక ముళ్లకంపలతో మూసుకుపోయి సక్రమంగా లేని దారిలోనే వీరు రాకపోకలు సాగించాల్సి వచ్చేది. విన్నవించుకున్నా వీరి సమస్యలపై దృష్టిసారించిన పాలకులు లేరు. అయితే ప్రస్తుత ప్రభుత్వం వీరికి పక్కారోడ్డు వేసి మౌళిక వసతులను కల్పించింది. శనివారం నుంచి రోడ్డు గ్రామస్థులకు అందుబాటులోకి వచ్చింది. దీంతో గ్రామస్థుల ఆనందానికి అవధులు దాటింటి. నూతన రోడ్డుపై నిలబడి వారు ప్రభుత్వానికి, రోడ్డు వేయించిన మంత్రి ఆర్కేరోజాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తాతలు, ముత్తాతల కాలం నుంచి అంతంత మాత్రమే ఉన్న మార్గంలోనే జీవనం కొనసాగించారన్నారు. రాత్రి పూట గ్రామానికి వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడేవారమన్నారు. వర్షాలు వచ్చే సమయంలో నరకం ప్రత్యక్షంగా కనిపించేదన్నారు. ఈ సమస్యను మంత్రి రోజా దృష్టికి తీసుకెళ్లామని ఆమె తుడా నిధులు రూ.10 లక్షలు మంజూరు చేయించి ఈ నెల 2వ తేదీన భూమిపూజ వేసి పనులు ప్రారంభించారన్నారు. ఎంపీటీసీ చంద్రారెడ్డి, సర్పంచ్ సెల్వి, వైస్ సర్పంచ్ దేవరాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## టిడిపి కూటమికి ఎమ్మార్పీఎస్ మద్దతు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన కూటమికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ మద్దతు ఇస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ మాదిగ తెలిపారు. చిత్తూరు ప్రెస్క్లబ్లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పై ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ అమలు చేయడంలో వైసీపీ ప్రభుత్వం మాట తప్పిందని ధ్వజమెత్తారు. మాదిగల విశ్వరూప సభకు ఈనెల 30న గుంటూరులో అనుమతి ఇవ్వాలని కోరగా రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించడం బాధాకరమన్నారు. వైసిపి ప్రభుత్వానికి మాదిగల సత్తా ఏమిటో రానున్న ఎన్నికల్లో చూపిస్తామని హెచ్చరించారు. ఏప్రిల్ 7న గ్రామస్థాయి నుంచి మాదిగల సమావేశాలు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గం ఇంచార్జ్ రాజకుమార్, రాష్ట్ర నాయకులు అనిల్ కుమార్, మురళి, పలమనేర్ ఇంచార్జ వెంకటాచలం, పుంగనూరు ఇంచార్జ్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించాలి: ఎంపిడిఓ

**ప్రజాశక్తి- బంగారుపాళ్యం:** సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో శివశంకర్ అన్నారు. శనివారం మండలంలోని జంబు వారిపల్లి, నలగంపల్లి, తిమోజిపల్లి, చికూర్ పల్లి సచివాలయాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం నుండి అందించే సంక్షేమఫలాలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అలాగే సమయపాలన పాటించాలని, ప్రభుత్వం అందించే కుల, ఆదాయ, నివాస, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేసేందుకు ఆన్లైన్లో నమోదు చేయాలని, వాటిని పంపిణీ చేపట్టేందుకు ప్రభుత్వం నుండి అనుమతి మంజూరు అయిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు మధు, వాణి, సబిత, జోత్స్న, సల్మా, సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలి'

**ప్రజాశక్తి- వెదురుకుప్పం:** ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల అధికారి, ఆర్డీవో వెంకటరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరి ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన అన్ని పార్టీల నేతల సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అన్ని పార్టీలవారు దానిని తూచాతప్పకుండా పాటించాలన్నారు. సమావేశాలు పెట్టాలన్నా, ఫ్లెక్సీలు పెట్టాలన్నా, కరపత్రాలు వేయాలన్నా, ప్రచారం చెయ్యాలన్నా అనుమతి తప్పనిసరన్నారు. నియోజకవర్గంలోని వడమాలపేటలో 31 పోలింగ్ కేంద్రాలు, పుత్తూరులో 64, నగరిలో 80, నింద్రలో 25, విజయపురంలో 29 పోలింగ్ కేంద్రాలు చొప్పున 229 కేంద్రాలు ఉన్నాయని పుత్తూరులోని పోలింగ్ స్టేషన్లు 52, 68లలో 1500 ఓటర్లకు ఉన్నందున రెండు ఆక్సిలరీ పోలింగ్ స్టేషన్లు అదనంగా ఏర్పాటు చేశామన్నారు. దీంతో నియోజకవర్గంలో 231 పోలింగ్ స్టేషన్లు ఉంటాయన్నారు. ఫారం 7 ,8 దరఖాస్తులకు గడువు ముగిసినందున వాటిని ఇక స్వీకరించడం జరగదన్నారు. ఏప్రిల్ 15వ తేదీవరకు కొత్త ఓటరు నమోదు ఫారం-6 స్వీకరిస్తామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో కనీస మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. ప్రశాంత వాతావరణంలో స్వార్వత్రిక ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. పోలింగ్ ఏజెంట్లు నియామకంలో ఎన్నికల సంఘం నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# సేవాభావంతో ఉత్తమ పౌరులుగా ఎదగాలి: ఎంఈఓ

**ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం:** విద్యార్థులు విద్యార్థిదశలో సేవాభావం, క్రమశిక్షణ అలవర్చుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఎంఈఓ సబర్మతి అన్నారు. శనివారం మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట విజయవాణి హైస్కూల్లో పాఠశాల కరస్పాండెంట్ వెంకటాద్రి నాయుడు, ప్రధానోపాధ్యాయురాలు రజిని, ఉపాధ్యాయ బృందంతో కలిసి పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో సబర్మతి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరం ఎదగాలని తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్ట తేవాలన్నారు. సాంస్కృతిక నృత్యాలు, ఆటల పోటీలలో విద్యార్థులు అలరించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో రవీంద్ర కుమార్ శ్రీ వెంకటేశ్వర విద్యానికేతన్ పెనుమూరు కరస్పాండెంట్ కేశవ చౌదరి, ఎస్వి కాలేజ్ చైర్మన్ గంగాధరం, మాజీ సర్పంచ్ విజయబాబు, రిటైర్డ్ టీచర్ సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

చిన్నారులకు బహుమతులు ప్రధానం చేస్తున్న కరస్పాండెంట్

# మంగళ విద్యావాణి సంచిక ఆవిష్కరణ

**ప్రజాశక్తి- బంగారుపాళ్యం:** విద్య వికాసం మంగళ విద్యావాణి మాస పత్రికతోనే అని ఎంఈఓ నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళ విద్యా వాణి 26వ సంచిక ఆవిష్కరణ ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల ఉపయోగార్థం విద్యార్థులచే నిర్వహిస్తున్న ఏకైక మాసపత్రిక మంగళ విద్యావాణి అన్నారు. ఈ పాఠశాల వినూత్న కార్యక్రమాలకు నిలయం జిల్లాకే కాక రాష్ట్రానికి ఆదర్శమని కొనియాడారు. ఈ సంచిక దాత విశ్రాంత మేనేజర్ బాలరాజు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనంలో అలవర్చుకునే కళలే వారి ప్రతిభకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో గణిత అవధాని హెచ్.అరుణ శివప్రసాద్, సంజీవి, భారతి, పిల్లారప్ప, మోహన్ రెడ్డి, ధనశేఖర్, ప్రేమకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# 'బీసీలందరూ టిడిపి వెంటే'

### టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ థామస్

**ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు:** బీసీ కులాలకు చెందిన కుటుంబాలన్నీ తెలుగుదేశం పార్టీ వెంటే ఉన్నారని నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ అన్నారు. జయహో బిసి, టిడిపి క్లస్టర్ ఇన్చార్జి, యూనిట్ ఇన్చార్జిలతో శనివారం మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. థామస్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలోనే బీసీ కులాల చేతివృత్తులతోపాటు వారి ఆర్థిక పురోభివృద్ధికి నాంది పలికారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం బీసీల కోసం 24శాతం రిజర్వేషన్ కల్పిస్తామని పేర్కొంటే మాజీ సీఎం చంద్రబాబు నాయుడు టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 34శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పారంటే బీసీలపై ఎంత గౌరవం ఉందో ఇట్టే అర్థమవుతుందన్నారు. సమావేశంలో పొన్న యుగంధర్ శ్రీధర్ యాదవ్, జ్యోతి యాదవ్, కృష్ణమ నాయుడు, దేవసుందరం, వెంకటేష్, రవి ప్రకాష్, ఇందిరమ్మ, నియాజ్అలీ, సురేష్, మునిరాజయాదవ్, శరవణ కుమార్ పాల్గొన్నారు.

## రాజేశ్వరి మృతికి నివాళి

**వెదురుకుప్పం:** మండలంలోని వెదురుకుప్పం పంచాయితీ గుండుపల్లి గ్రామానికి చెందిన ఆర్.రాజేశ్వరి (45) శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వి.ఎం.థామస్, జనసేన ఇన్చార్జి యుగంధర్ ఆమె మృతిదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపియజేశారు.

# 'నారాయణస్వామి అసమర్థుడు'

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న జీడి నెల్లూరు ఎంఎల్ఏ నారాయణస్వామి దళితుల అభివృద్ధి కోసం ఏమి చేయలేని అసమర్థుడుని కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయస్వామిపై ఉన్న వ్యతిరేకత వల్ల ఆయన కుమార్తెను వైసిపి జీడి నెల్లూరు నియోజకవర్గంలో పోటీకి నిలిపారని ఎంఎల్ఏగా, డిప్యూటీ సిఎంగా పని చేసిన నారాయణస్వామి జీడి నెల్లూరు నియోజకవర్గంలోని దళితుల అభివృద్ధి కోసం ఎలాంటి కార్యక్రమాలు చేయలేకపోయారన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన తనకు టిక్కెట్ ఇస్తే జీడి నెల్లూరు నుండీ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్

# క్రైం న్యూస్

## అక్రమ మద్యం స్వాధీనం

### పలు ప్రాంతాల్లో ఐదుగురు అరెస్టు

ముద్దాయిని, మద్యంను చూపుతున్న డిఎస్పీ రాజగోపాల్ రెడ్డి

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** చిత్తూరు రూరల్ మండలం ఎన్ఆర్పేట పోలీస్స్టేషన్ పరిధిలో రూ.35వేలు విలువ చేసే కర్ణాటక, పుదుచ్చేరి మద్యం స్వాధీనం చేసుకొని అక్రమ మద్యం నిల్వ ఉంచిన రమేష్ నాయుడును అదుపులోకి తీసుకొని రిమాండ్కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చిత్తూరు డిఎస్పీ రాజగోపాల్ రెడ్డికి రాబడిన సమాచారం మేరకు చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుల్లాయప్ప ఎన్ఆర్.పేట సబ్ఇన్స్పెక్టర్ కె. వెంకట సుబ్బమ్మ సిబ్బందితో కలసి శనివారం ఉదయం రూరల్ మండలం ముత్తుకూరు గ్రామ సమీపంలోని నాగేష్ నాయుడు మామిడి తోపులో గల ముళ్ళ పొదల వద్ద మద్యం అక్రమ నిల్వ గుర్తించారు. సదరు మామిడి తోటలో పనిచేయుచున్న ఎ.రమేష్ నాయుడుని మద్యం అక్రమ నిల్వ గురించి విచారించగా తోట యజమాని నాగేష్, అతని అల్లుడు రమణా నాయుడు కర్ణాటక, పుదుచ్చేరి నుండి మద్యం కొనుగోలు చేసి ముత్తుకూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం సమయంలో పంచడానికి ఉంచినట్లు ఒప్పుకున్నాడు. దీంతో మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి ముద్దాయి రమేష్ నాయుడుని రిమాండ్కు తరలించారు.

**41 లీటర్ల నాటుసారా, 250 మద్యం ప్యాకెట్లు స్వాధీనం**

శనివారం ఉదయం చిత్తూరు వన్టౌన్ పోలీసులు స్థానిక మూడో గేట్ వద్ద పొదల్లో దాచిన 257 ప్యాకెట్ల నాటుసారా 41 లీటర్లు స్వాధీనం చేసుకొని చిన్నయ్య(58) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు వన్టౌన్ సిఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. పట్టుబడ్డ ముద్దాయి నుండీ 3,400 నగదు సీజ్ చేశామని, పట్టుబడ్డ నాటుసారా గుడిపాల మండల రసనపల్లికి చెందిన దేవదాస్ అనే వ్యక్తి నుండీ తీసుకొచ్చినట్లు తెలిసిందని, ఇద్దరి పై కేసు నమోదు చేసి చిన్నయ్యను రిమాండ్ పంపినట్లు తెలిపారు. రసనపల్లికి చెందిన దేవదాసు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అలాగే నగరంలోని ఐటిఐ కాలేజీ వెనుక వైపు ఉన్న స్మశానం వద్ద అక్రమ మద్యం విక్రయిస్తున్న అందిన సమాచారం మేరకు వన్టౌన్ సిఐ ఊసలయ్య దాడులు నిర్వహించారు. అక్రమ కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ధనరాజ్ను అరెస్టు చేసి, అతని నుంచి 250 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిపై కేసు నమోదు చేశారు. సదరు ముద్దాయికి కర్ణాటక మద్యం సరఫరా చేస్తున్న కుమారస్వామి నాయుడు కోసం దర్యాప్తు చేపట్టారు. పట్టుబడ్డ ముద్దాయిని జుడిషియల్ కస్టడీ నిమిత్తం కోర్టులో హాజరు పరచిన్నట్లు సిఐ తెలిపారు.

పట్టుబడ్డ నాటు సారాను చూపుతున్న సిఐ విశ్వనాథరెడ్డి

**రామకుప్పం:** మండల పరిధిలోని రాజుపేట వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యంను పట్టుకొని ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి రాజుపేట గ్రామం వద్ద ఎఫెస్టి టీమ్ రాధాకృష్ణ, ఎస్సై ఎన్నికల నియమావళి అమలులో భాగంగా వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఈ సందర్భంగా అక్రమంగా కర్ణాటక మద్యాన్ని రవాణా చేస్తున్న స్థానిక మోడల్ కాలనికి చెందిన హరినాయక్, అతని తమ్ముడు రవినాయక్లను అరెస్టు చేసి అతని వద్దనుండి రూ. 44 వేలు విలువచేసే 1056 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్కు తరలించామన్నరు.

## రూ.16లక్షలు నగదు స్వాధీనం

**ప్రజాశక్తి- పలమనేరు:** పలమనేరు పట్టణం ఎంఎన్ఎస్ కాలనీలో లక్ష్మీ అనే మహిళ ఇంట్లో భారీగా నగదు ఉందని సమాచారం మేరకు శనివారం మహిళ ఇంటిలో ఫ్లయింగ్ స్క్వాడ్ దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో రూ.16లక్షలు సరైన లెక్కలు లేని నగదును స్వాధీనం చేసుకున్నారు. అందిన పక్కా సమాచారంతో సోదాలు నిర్వహించి నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్, రెవెన్యూ స్క్వాడ్ సిబ్బంది తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో నగదు ఎలా వచ్చిందంటూ ఇంటి యజమాని వద్ద వివరాలు సేకరించారు. అనంతరం ఆ నగదును ఆదాయ పన్ను శాఖ అధికారులకు అందజేశారు. సరైన లెక్కలు ఉంటే చూపి నగదును తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల వేళ భారీ మొత్తంలో నగదు పట్టుబడడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. అధిక మొత్తంలో నగదును ఇంటిలో దాచడం చట్టరీత్య నేరమని పోలీసులు వారిని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** పలమనేరు-కుప్పం జాతీయ రహదారిలో కైగల్ బ్రిడ్జి సమీపంలో ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ధర్మపోరి పంచాయతీ తూర్పుగడ్డ గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం (65) సొంత పనుల నిమిత్తం కర్ణాటక రాష్ట్రంలోని మోపురుపల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. గమనించిన స్థానికులకు 108 ద్వారా స్థానిక పిహెచ్సికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కుప్పం పిఈఎస్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

# సంక్షిప్త వార్తలు

## ఎంపి అభ్యర్థి పరిచయ కార్యక్రమం

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తెలుగుదేశం పార్టీ ఎన్డీఏతో పొత్తు పెట్టుకుందని చిత్తూరు పార్లమెంట్ టిడిపి అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. శనివారం గంగాధర్ నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని ఎస్ఆర్ పురంలో జిల్లా బిజెపి అధ్యక్షులు జగదీశ్వర్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన పరిచయ వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ రావు మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ ఎన్డీఏతో ఉన్నప్పుడు రాష్ట్రం అనేక రకాలుగా అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వ తీరుతో రాష్ట్ర అభివృద్ధి కుంటుబడిపోయిందని, అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయని, రాజధాని లేని రాష్ట్రంగా, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు.

## బిసివైపి ప్రచారం

**ప్రజాశక్తి- సోమల:** భారత చైతన్య యువజన పార్టీ (బిసివైపి) వ్యవస్థాపకులు రామచంద్ర యాదవ్ గెలుపు కోసం మండలంలో పార్టీ కార్యకర్తలు విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఇరికిపెంట పంచాయతీలోని పలు గ్రామాలలో పార్టీకి చెందిన నక్కా ఈశ్వర్, సుబ్రహ్మణ్యం, సురేంద్ర, గణేష్ యాదవ్ ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం బీసీల అభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతున్న రామచంద్ర యాదవ్ గెలుపును గెలిపించాలని కోరారు.

## నిత్యావసరాల పంపిణీ

**ప్రజాశక్తి- సోమల:** మండలంలోని నంజంపేట గ్రామానికి చెందిన ఖిద్మత్ ఈఖల్క్ కమిటీ ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా 35 కుటుంబాలకు 11 రకాల నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. గత మూడు సంవత్సరాలుగా గ్రామానికి చెందిన ముస్లిం యువత ప్రతినెలా 10 కుటుంబాలకు తగ్గకుండా నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తూ వస్తున్నారు. ఈక్రమంలో రంజాన్ మాసం సందర్భంగా కులమతాలకు అతీతంగా నిరుపేదలకు కందిపప్పు, చక్కెర, బియ్యం, వంటనూనె, ఇతర సరుకులను పంపిణీ చేశారు. అక్బర్, చాంద్, బాషా, లల్లు, ఇంత్లు, అస్లాం, సద్దాం, ఇర్ఫాన్, రిజ్వాన్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

## పోలీసుల కవాతు

**ప్రజాశక్తి - రామకుప్పం:** స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని రామకుప్పం ఎస్సై శివకుమార్ కోరారు. కుప్పం సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీనాథ్ పర్యవేక్షణలో, కుప్పం రూరల్ ఇన్స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి సూచనల మేరకు శనివారం మండల పరిధిలో పోలీసు సిబ్బంది, 50 మంది ప్రత్యేక కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఓటరుకు మేము ఉన్నామని భరోసాను ఇచ్చారు. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియకు ఏమైనా ఆటంకం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బిఎల్ఓలతో సమీక్ష

**ప్రజాశక్తి- సోమల:** మండలంలోని బిఎల్ఓలతో పుంగనూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్ రెడ్డి శనివారం స్థానిక తహసిల్దారు కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రత్యేక ప్రతిభావంతులైన ఓటర్లు 85 ఏళ్లు పైబడిన ఓటర్లను గుర్తించి వారి వివరాలను సోమవారం లోపు అందజేయాలని కోరారు. ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా వీఆర్వోలు బిఎల్వోలు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో తహసిల్దార్ నాగరాజా, డిటి, ఆర్ఐ, వీఆర్వోలు, బిఎల్వోలు పాల్గొన్నారు.

## క్షురకుల నియామకానికి యానాదయ్య అడ్డు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)** రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరినందుకు తొమ్మిదిమంది నాయి బ్రాహ్మణులను తిరుమల కళ్యాణకట్ట నుంచి తొలగించారని, వారిని పునర్నియామకానికి బోర్డు ఆదేశించినా ఓ ఓటు సభ్యుడిగా, సాటి కులస్తుడిగా అడ్డుపడడం యానాదయ్యకు తగునా అని టీటీడీ మహిళా క్షురకుల వ్యవస్థాపక అధ్యక్షురాలు కె. రాధాదేవి ప్రశ్నించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది ఫిబ్రవరి 25వ తేదీన విలేకరుల సమావేశంలో నాయి బ్రాహ్మణులకు 20వేల జీతాన్ని అందిస్తామని చెప్పి మాట తప్పారన్నారు. టిటిడి బోర్డు చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తొలగించిన తొమ్మిది మందిని తిరిగి విధుల్లోకి తీసుకుంటామని మాట ఇచ్చిన అమలు పరచక పోవడానికి కారణం ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 110 జీవో ప్రకారం వేతనాలు చెల్లింపు జరుగుతుందని చెప్పి కార్పొరేషన్ లో ఉన్న 18 మందికి మాత్రమే జీవో ప్రకారం జీతాలు చెల్లించడంలో దాగి ఉన్న రహస్యం ఏందో బహిర్గతం చేయాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తూ నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మన్గా కొనసాగుతున్న తొండమల్ల పుల్లయ్య తిరుమలలోని కళ్యాణకట్టలోకి వెళ్లి తిరుపతి వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా బరిలో ఉన్న భూమన అభినయ రెడ్డి ఇంటి వద్దకు రావాలని, ఎన్నికల్లో అభినయ రెడ్డి గెలుపు కోసం పనిచేయాలని కోరడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడం కాదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. టిటిడి పాలకమండలి సభ్యుడుగా తన సొంత ప్రయోజనాలను చక్కబెట్టుకోవడానికి యానాదయ్య పని చేస్తున్నారని, నాయి బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఏమాత్రం కాదని స్పష్టం చేశారు. తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోకపోతే తగిన కార్యచరణతో ముందుకెళతానని హెచ్చరించారు.

## తహశీల్దార్ ఇంట్లో ఏసీబీ దాడులు

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ** గతంలో రేణిగుంట తహశీల్దార్ గా విధులు నిర్వహించి ప్రస్తుతం కడప జిల్లాలో తహశీల్దారుగా బాధ్యతలు నిర్వహిస్తున్న శివప్రసాద్ ఇంటిపై ఏసీబీ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. పలు అవినీత, అక్రమాలకు పాల్పడుతున్నట్లు అవినీతి నిరోధక శాఖ అధికారులకు అందిన సమాచారం మేరకు ఏసీబీ అధికారులు నాలుగు బందాలుగా ఏర్పడి ఏకకాలంలో దాడులు నిర్వహించారు. బెంగళూరు, కడప, తిరుపతి, రేణిగుంట ప్రాంతాలలోని శివప్రసాద్ ఇండ్లు, కార్యాలయం, బంధువుల ఇళ్లల్లో శనివారం దాడులు చేశారు. రేణిగుంట లోని ఇంటి వద్ద ఎలాంటి ఆధారాలు దొరక్కపోగా, తిరుపతి పద్మావతి పురం లోని ఆయన నివాసంలో పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు, బెంగళూరులో నివాసం లో భారీ స్థాయిలో నగదును పట్టుకున్నట్లు సమాచారం. ఏసీబీ దాడులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. తహశీల్దార్ శివప్రసాద్ భారీ స్థాయిలో అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించారు.

**IN THE COURT OF THE II ADDL JUNIOR CIVIL JUDGE, CHITTOOR**
**O.S.No. 963 of 2021**
Between
**Y.Radhamma** ...Plaintiff
And
**Y.Kannamma and others ... Defendants**
**NOTICE TO THE DEFENDANTS 2 & 3**
To
**D2. Y.Mohan Reddy,**
S/o Late Y.Seenu Reddy,
**D3. Y.Vasudeva Reddy,**
S/o Late Y.Seenu Reddy,
Both are residing at
Valasanellepalli Village,
S.S.Konda Post,G.D.Nellore Mandal,
Chittoor District-517421
Sir,
WHERE AS the Plaintiff has filed the above suit for grant of permanent injunction and for other reliefs over the plaint schedule property against you and others and the above suit stands posted to **19-04-2024** for your appearance. If you do not appear on the above date at **10.30 A.M** either in person or through your advocate the matter will be decided exparte.
**Sd/-(V.RAMANARAYANA REDDY)**
Advocate for the Plaintiff
Place: Chittoor Date:22.03.2024

**IN THE COURT OF THE 1ST ADDL JUNIOR CIVIL JUDGE, CHITTOOR**
**O.S.No. 132 of 2022**
Between
**R.Ramesh** ...Plaintiff
And
**G.Sathya and others ... Defendants**
**SUMMONS TO DEFENDANTS NO.6**
To
**Smt Sonia,** W/o Vikram
D/o Late T. Gunalam,
residing at Athmakur Village,
N.R.Pet Post, GD.Nellore Mandal
Chittoor District
Madam
Please take summons that the above Suit **O.S.No.132 of 2022** and petition **I.A.144 of 2022** are filed by the plaintiff against you and others is posted to **16.04.2024** for your appearance. If you do not appear on 16.04.2024 at 10-30 A.M before this Hon'ble Court either in person or through an Advocate the matter will be decided exparte.
**Sd/- M.CHANDRASEKHAR**
Advocate for Plaintiff
Place: Chittoor Date:29.03.2024